ఫార్మసీ ఆఫీసర్ల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేయాలి

• తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో 732 ఫార్మసీ ఆఫీసర్ల పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేయాలని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సెక్రటరీ గోపీకాంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కోర్టు నుంచి ఎలాంటి స్టే లేనందున వెంటనే ఫలితాలను ప్రకటించాలని వారు కోరారు. అనంతరం గోపీకాంత్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి పూర్తి నివేదిక రాగానే ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని కోర్టుకు సమర్పించి ఫలితాలు ప్రకటిస్తామని వెల్లడించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కందుకూ శరత్ బాబు, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎవి శ్రీహరి తదితరులున్నారు.

అందుబాటులోకి ఏవియెర్ డ్యూయల్ ఛాంబర్ లెడ్‌లెస్ పేస్ మేకర్ : అబాట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రపంచంలోనే మొట్టమొదటి డ్యూయల్ ఛాంబర్ లెడ్‌లెస్ పేస్‌మేకర్ అయిన ఏవియెర్ డ్యూయల్ ఛాంబర్ లెడ్‌లెస్ పేస్ మేకర్‌ను భారతదేశంలో అందుబాటులోకి తెస్తున్నట్టు అబాట్ సంస్థ ప్రకటించింది. ఈ చిన్న ఆధునాతన పరికరం సాంప్రదాయిక పేస్‌మేకర్లలో ఉపయోగించే వైర్లు (లెడ్స్) లేదా సర్జికల్ పాకెట్స్ లేకుండానే గుండె సరిగ్గా కొట్టుకోవడానికి సహాయపడుతుందని తెలిపింది. లెడ్స్ లేని పేస్‌మేకర్లు సిరలోకి చొప్పించిన కాథెటర్ ద్వారా గుండె లోపల నేరుగా ఉంచబడిన చిన్న పరికరాలు. వీటిలో లెడ్ వైర్ల అవసరం లేదు. ఇది ప్రక్రియను తక్కువ హానికరంగా చేస్తుంది. సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. సాధారణంగా వేగంగా, సులభంగా కోలుకోవడానికి సహాయపడుతుందని వివరించింది. లెడ్‌లెస్ పేస్ మేకర్‌ను అందుబాటులోకి తేవడం పట్ల భారత్ అబాట్ కార్డియాక్ రిథమ్ మేనేజ్‌మెంట్ బిజినెస్ జనరల్ మేనేజర్ అజయ్ సింగ్ చౌహాన్ సంతోషం వ్యక్తం చేశారు.

పరిహారమివ్వకుంటే సిఎంని నిలదీస్తాం

• వందరోజులైనా సిగాచి బాధిత కుటుంబాల వెతలు పట్టవా?
• కోటి రూపాయలిస్తామని రూ.25 లక్షలే ఇవ్వడం దుర్మార్గం
• అంజయ్య భవన్ ఎదుట ధర్నాలో చుక్క రాములు, పాలడుగు భాస్కర్, వీరయ్య
• కార్మిక శాఖ జాయింట్ కమిషనర్‌కు సిఐటియు నేతల వినతి


ధర్నా చేస్తున్న సిగాచి బాధితులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సిగాచి పరిశ్రమ ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రకటించిన కోటి రూపాయల పూర్తి పరిహారం రెండు, మూడు రోజుల్లో ఇవ్వకుంటే సిఎం రేవంత్‌రెడ్డిని నిలదీస్తామని, ఆయన ఇంటి ముందు ధర్నా చేస్తామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య హెచ్చరించారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో చనిపోయిన 54 మంది కార్మికులకు చెందిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కమిషనరేట్ (అంజయ్యభవన్) ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కమిషనర్ శ్యాంసుందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని, ఆ కంపెనీపై చట్టపర చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అంతకుముందు ధర్నానుద్దేశించి చుక్కరాములు మాట్లాడుతూ... యాజమాన్యంతో ఒక్కొక్కరికి రూ. కోటి పరిహారం ఇప్పిస్తామన్న హామీ వంద రోజులైనా నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు. కంపెనీ యాజమాన్యం ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవడమేంటని ప్రశ్నించారు. ఘోర దుర్ఘటనకు కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా కార్మిక, పరిశ్రమల శాఖలు ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నాయని నిలదీశారు. తీవ్రంగా గాయపడిన కార్మికులు జీవచ్ఛంలాగా పడి ఉండాల్సిందేనని, వారికి కూడా పూర్తిపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు నెలల నుంచి జీతాలివ్వకుంటే అదే కంపెనీని నమ్ముకుని బతుకుతున్న కార్మికులు కుటుంబాల జీవనం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. సిగాచి బాధిత కార్మికులకు న్యాయం జరిగే వరకు సిఐటియు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఆ కంపెనీలో పనిచేసే కార్మికుల్లో ఎక్కువ మంది బీహార్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బెంగాల్, అస్సాం, రాజస్థాన్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ చెందిన వలస కార్మికులేననీ, బాధిత కుటుంబాలు తమ పెద్ద దిక్కును కోల్పోయి నెలల తరబడి కంపెనీ ఆర్థిక సహాయం ఇక్కడ పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన రోజు హడావిడి చేసిన బిజెపి, కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాలకు పరిహారం ఇప్పించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. బాధిత కుటుంబాలకు పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందా? యాజమాన్యంతో ఇప్పిస్తుందా? అనే విషయాన్ని వెంటనే తేల్చాలని డిమాండ్ చేశారు.

ఎస్ వీరయ్య మాట్లాడుతూ... ప్రమాద ఘటన జరిగిన మరుసటి రోజు ముఖ్యమంత్రి, మంత్రులు ఘటనా స్థలాన్ని సందర్శించి చనిపోయిన కార్మికులకు సంబంధించిన బాధిత కుటుంబాలకు కోటి రూపాయలు, క్షతగాత్రులకు రూ.పది లక్షల చొప్పున యాజమాన్యంతో నష్టపరిహారం ఇప్పించి ఆదుకుంటామని హామీనిచ్చి నేటికీ న్యాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.రెండు లక్షల చొప్పున పరిహారాన్ని బాధిత కుటుంబాలకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు ఇప్పించడం లేదని నిలదీశారు. కాలం చెల్లిన యంత్రాలు, రియాక్టర్లతో సిగాచి యాజమాన్యం పనిచేయిస్తుంటే కార్మిక, పరిశ్రమల శాఖలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. జీవచ్ఛవాలుగా పడి ఉన్న క్షతగాత్రులైన కార్మికులకు రూ.50 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత కార్మిక కుటుంబాలకు పూర్తి నష్టపరిహారం ఒకే విడతలో ఇవ్వాలని కోరారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఐటియు పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ కమిటీ కన్వీనర్ ఎ.మాణిక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్, ఎస్‌వి రమ రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్, పద్మశ్రీ రాష్ట్ర నాయకులు సోమన్న, సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పి పాండురంగారెడ్డి, నాయకులు శాంత కుమార్, రాజు, తలారి శ్రీనివాస్, నాగ ప్రసాద్, వెంకటేష్, చంద్రయ్య, బంగార్రాజు, పుల్లంరాజు, శంకరయ్య, నరసింహారెడ్డి సిగాచీ పరిశ్రమ ప్రమాద బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

నవంబర్ 16 తర్వాతే అన్ని ఫలితాలు

• టియుఎంహెచ్ఇయు ప్రతినిధులతో గోపీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నిక నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందనీ, దీంతో అన్ని ఫలితాలను నవంబర్ తర్వాత ప్రకటిస్తామని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యదర్శి గోపీకాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ ఆధ్వర్యంలో నాయకులు, అభ్యర్థులు గోపీకాంత్ రెడ్డిని కలిసి పారామెడికల్ పోస్టులను భర్తీ చేయాలని వినతి పత్రం సమర్పించారు. నర్సింగ్ ఆఫీసర్లకు సంబంధించి మెరిట్ లిస్ట్ ఇప్పటికే ఇచ్చినందున అభ్యంతరాలు అన్ని క్లియర్ చేసి వెంటనే ఫైనల్ మెరిట్ లిస్ట్ ఇవ్వాలని కోరారు. ల్యాబ్ టెక్నీషియన్ల వెరిఫికేషన్ పూర్తి చేసినందుకు కార్యదర్శికి ధన్యవాదాలు తెలిపారు. వీరికి త్వరగా ఫైనల్ లిస్టు ఇచ్చి అపాయింట్ మెంట్ ఆర్డర్ ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గోపీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 16 తర్వాత పారామెడికల్ పోస్టులు ముఖ్యమంగా నర్సింగ్ ఆఫీసర్లు, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్లకు సంబంధించిన ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఫార్మసిస్టులకు సంబంధించి డ్రగ్ కంట్రోల్ అథారిటీ రిపోర్టు వచ్చిన తర్వాత లిస్టు పెడతామని చెప్పారు. అయితే ఈ నెల 24న హైకోర్టులో తుది తీర్పు వస్తుందనీ, ఆ తర్వాతే లిస్టు ప్రిపేర్ చేస్తామని చెప్పారు. కార్యదర్శిని కలిసిన ప్రతినిధుల్లో నర్సింగ్ ఆఫీసర్స్ నుంచి సుష్మ, శిరీష, రమేశ్ రెడ్డి, సురేష్, విజేత, రాకేశ్ తదితరులు, ల్యాబ్ టెక్నీషియన్ల నుంచి ఆదిత్య, సంగమేశ్, ఏఎన్ఎంల నుంచి నిజామాబాద్‌కు చెందిన కొంత మంది నాయకులు, ఫార్మసిస్టు నాయకులు పాల్గొన్నారు. నవంబర్ 17న పారా మెడికల్ పోస్టుల ఫలితాలు ప్రకటించకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేయాలని నాయకత్వం నిర్ణయించుకుంది.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కొత్త సంస్కరణలు అమలు

• రాజకీయ పార్టీల భేటీలో సిఇఒ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కేంద్ర ముఖ్య ఎన్నికల కమిషనర్ గ్యానేశ్‌కుమార్ ప్రవేశపెట్టిన కొత్త ఎన్నికల సంస్కరణలతో నిర్వహించనున్నట్టు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి సీ. సుధర్శన్‌రెడ్డి వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంస్కరణలు తొలిసారిగా బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో అమల్లోకి వస్తున్నాయని తెలిపారు. ఓటర్ల సౌకర్యం, పారదర్శకత, ఎన్నికల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా సంస్కరణలు తీసుకొస్తున్నట్టు తెలిపారు. "ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా ఏర్పాట్లు. ఓటర్లు తమ అభ్యర్థులను సులభంగా గుర్తించేందుకు ఇవిఎంలపై రంగు ఫోటోలు ఉంచడం. మహిళా ఓటింగ్ శాతం పెంచేందుకు మహిళా సిబ్బందిని అదనంగా నియమించడం. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌చెయిర్లు, ర్యాంపులు, పిక్-అప్/డ్రాప్ సదుపాయాలు. రియల్‌టైమ్ ఓటింగ్ టర్నౌట్ మానిటరింగ్ కోసం డిజిటల్ డ్యాష్‌బోర్డులు, మొబైల్ యాప్‌ల ఏర్పాటు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత పర్యవేక్షణ, జీపీఎస్ ట్రాకింగ్. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) ఉల్లంఘనలపై కఠిన చర్యలు, టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ. పేపర్ వినియోగం తగ్గించడం, డిజిటల్ సమాచార మార్పిడి ప్రోత్సాహం" మొదలగు కొత్త సంస్కరణలను పకడ్బందిగా అమలు చేయనున్నట్టు వారికి వివరించారు. ఈ సమావేశంలో బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ, మజ్లిస్ తదితర పార్టీల ప్రతినిధులతో పాటు అదనపు సిఇఒ లోకేష్ కుమార్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మార్కెట్లోకి ఆరమ్ విస్తరణ



ప్రజాశక్తి - హైదరాబాద్ : ప్రీమియర్ ప్రయివేటు సేఫ్ డిపాజిట్ లాకర్ల సంస్థ అయిన ఆరమ్ హైదరాబాద్ నగరంలోకి ప్రవేశించినట్లు తెలిపింది. 24 గంటలూ అందుబాటులో ఉండే టెక్ ఎనేబుల్డ్ బ్యాంకు లాకర్ సేవలను నగరంలోని సత్వ మాగ్నస్, అపర్ణ సరోవర్ గ్రాండ్‌లలో అమర్చామని ఆరమ్ సిఇఒ, ఫౌండర్ విజయ్ అరిశెట్టి తెలిపారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బెంగళూరు, విశాఖ తర్వాత హైదరాబాద్ మార్కెట్‌లోకి ప్రవేశించామన్నారు. 2026 నాటికి 50 ప్రీమియం కమ్యూనిటీలు, 10వేల లాకర్లు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

షియోమీ 10 ప్రీమియం సెంటర్ల ఏర్పాటు

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా 10 ప్రీమియం సర్వీస్ సెంటర్లను ప్రారంభించామని స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ షియోమీ వెల్లడించింది. వీటితో కస్టమర్ కేర్‌ను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లనున్నట్లు పేర్కొంది. ఈ కేంద్రాలు వేగవంతమైన సర్వీసులు, సౌకర్యవంతమైన వాతావరణం, హ్యాండ్స్ ఆన్ ఉత్పత్తి అనుభవాలను అందిస్తాయని పేర్కొంది. దేశంలో 100 ప్రీమియం సర్వీసు సెంటర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని షియోమీ ఇండియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధిన్ మాథుర్ అన్నారు.

డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణ అగ్రగామి

• కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌తో చిన్న, సన్నకారు రైతుల అనుసంధానం
• జర్మనీ పరిశోధన సంస్థ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పెట్టుబడి వ్యయం, రసాయనాల వినియోగాన్ని తగ్గించి, ఈ రంగాన్ని లాభసాటిగా మార్చాలన్నదే తమ సంకల్పమని స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతను చిన్న, సన్నకారు రైతులకు ఎలా అనుసంధానం చేయాలనే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో జర్మనీకి చెందిన ప్రముఖ పరిశోధన సంస్థ 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్ఐ' ప్రతినిధుల బృందంతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలోని వ్యవసాయ సాగు పద్ధతులు, అనుసరిస్తున్న విధానాలను మంత్రి వారికి వివరించారు. "రాష్ట్ర జనాభాలో 55 శాతం మందికి వ్యవసాయం జీవనోపాధి కల్పిస్తోంది. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలకు తన చేయూతను అందిస్తోంది. అయితే రోజురోజుకూ వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. సాగులో పురుగు మందుల వినియోగం పెరిగి పర్యావరణానికి ఎంతో హానీ జరుగుతోంది. ఇలాంటి తరుణంలో పెట్టుబడి వ్యయం, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలంటే కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌ను వ్యవసాయానికి అనుసంధానించాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగానే మా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. టెక్నాలజీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది' అని వివరించారు. 'అత్యాధునిక సెన్సార్ల ద్వారా నేల స్వభావాన్ని రైతులు ముందే తెలుసుకోవచ్చు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ద్వారా పురుగు మందుల వినియోగాన్ని తగ్గించొచ్చు. ఫలితంగా రసాయనాల కొనుగోలు ఖర్చు, శ్రమ గణనీయంగా తగ్గుతుంది. రైతులపై పడే ఆర్థిక భారం తగ్గుతుంది. పర్యావరణానికి మేలు జరుగుతుంది. సుస్థిరమైన, వాతావరణం-రెసిలియెంట్ వ్యవసాయ పద్ధతులకు మార్గం సుగమం అవుతుంది' అని చెప్పారు. అనంతరం... రాష్ట్రంలో గత రెండేళ్లుగా వేములవాడ కు సమీపంలోని మూడు గ్రామాల్లో 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్ఐ' ఆధ్వర్యంలో అమలవుతున్న 'యాక్సిలరేటింగ్ క్లైమేట్-రెసిలియెంట్ అగ్రికల్చర్ ఇన్ తెలంగాణ' ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చొరవ చూపాలని సంస్థ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం కోదండరెడ్డి, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, జర్మనీ రాయబార కార్యాలయం(న్యూఢిల్లీ) ఫుడ్, అగ్రికల్చర్ డివిజన్ హెడ్ వోల్కర్ క్లైమా, ఫ్రాన్ హోఫర్ హెచ్‌హెచ్ఐ ప్రతినిధులు డా. సెబాస్టియన్ బోస్సే, డా.రఘు చలిగంటి పాల్గొన్నారు.



రేపు 'ఛలో బస్‌భవన్'

• మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలు ప్రభుత్వం వెంటనే వెనుకకు తీసుకోవాలనే డిమాండ్‌తో ఈ నెల 9న ఛలో బస్ భవన్ నిర్వహిస్తున్నట్టు మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రయాణికులు, ప్రజలందరినీ కలుపుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పార్టీ నిర్ణయించినట్టు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమంటూ వారి కుటుంబ సభ్యులకు బస్సు ఛార్జీలు పెంచడం సరి కాదన్నారు. పెరిగిన బస్సు ఛార్జీలు సామాన్యులకు పెనుభారంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

బిసి రిజర్వేషన్ల కేసులో సిపిఐ ఇంప్లీడ్


• హైకోర్టులో పిటిషన్ వేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించిన కేసులో సిపిఐ ఇంప్లీడ్ అయ్యింది. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన కేసులో తమను ప్రతివాదులుగా చేర్చాలంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో బిసిలు 42 శాతం రిజర్వేషన్ వర్తించే 9 జీవోను సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని సమర్థిస్తున్నామని కూనంనేని తెలిపారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టేయాలనీ, ఆ కేసులో తమను ప్రతివాదులుగా చేర్చాలని కోరారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు అసెంబ్లీలో సీపీఐ మద్దతు ప్రకటించింది.

పొన్నం 'నోటి దురుసు'.. కాంగ్రెస్‌లో 'దుమారం'!

• సహచర మంత్రి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు
• ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు..

అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తా: అడ్లూరి





ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సహచర మంత్రిపై నోరు జారిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పి తెచ్చిపెట్టారు. సమావేశానికి సమయానికి రాలేదన్న అసహనంతో దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఉద్దేశించి 'ఆ దున్నపోతుగానికేం తెలుసు' అంటూ చేసినట్టుగా ఉన్న బాడీ షేమింగ్ వ్యాఖ్యల వీడియో పుటేజీ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యాఖ్యలు మైక్‌లో రికార్డయి బయటకు రావడంతో వివాదం ఒక్కసారిగా భగ్గుమంది. ఇది కేవలం ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలకు దారితీసినా.. 'మాదిగల ఆత్మగౌరవం' చుట్టూ తిరుగుతూ కులం రంగు పులుముకుంది. మంత్రి లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, దళిత సంఘాలు క్షమాపణకు అల్టిమేటం జారీ చేయడంతో ఈ ఎపిసోడ్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతర్గత సంక్షోభానికి దారితీసింది. పొరపాటును అంగీకరించకుండా ఇది బీఆర్ఎస్ కుట్ర అంటూ పొన్నం చెప్పడాన్ని మంత్రి అట్లూరి, ఆయన అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇది పొన్నం అహంకార వైఖరికి నిదర్శనమనే అభిప్రాయం ఆ పార్టీలో వినిపిస్తోంది.

అసలేం జరిగింది?

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రహ్మత్‌నగర్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ మీడియా సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే, మంత్రి లక్ష్మణ్ కాస్త ఆలస్యంగా రావడంతో పొన్నం ప్రభాకర్ అసహనానికి గురయ్యారు. పక్కనే ఉన్న మంత్రి వివేక్ చెవిలో 'మనకు టైం అంటే తెలుసు.. జీవితమంటే తెలుసు.. వారికేం తెలుసు.. ఆ.. దున్నపోతు గానికి' అని గుసగుసలాడారు. మైకులు ఆన్‌లో ఉండటంతో ఈ వ్యాఖ్యలు స్పష్టంగా రికార్డయ్యాయి. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వివాదం మొదలైంది. సహచర మంత్రిని, అందులోనూ ఒక దళిత మంత్రిని ఉద్దేశించి బాడీ షేమింగ్ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఇది కేవలం లక్ష్మణ్‌కు జరిగిన అవమానం కాదని, మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఎమ్మార్పీఎస్ వంటి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

క్షమాపణకు ససేమిరా.. బీఆర్ఎస్ కుట్రంటూ ఎదురుదాడి

వివాదం ముదురుతున్నా మంత్రి పొన్నం ప్రభాకర్ తీరులో మార్పు రాలేదు. తప్పును అంగీకరించి క్షమాపణ కోరాల్సింది పోయి, ఎదురుదాడికి దిగారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని, ఇదంతా బీఆర్ఎస్ సోషల్ మీడియా చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. 'అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పీసీసీ అధ్యక్షులు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్' అని చెప్పడం ద్వారా ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని చూశారు. అయితే, ఆయన వైఖరి సమస్యను మరింత జఠిలం చేసింది. కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయకపోవడం పొన్నం అహంకారానికి నిదర్శనమని, ఆయనలోని దురుసుతనాన్ని ఇది బయటపెట్టిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో ఈ వివాదాన్ని త్వరగా పరిష్కరించకపోతే, అది ప్రభుత్వ ప్రతిష్టకు తీవ్ర భంగం కలిగించడంతో పాటు పార్టీలోని సామాజిక తరగతుల మధ్య అగాధాన్ని పెంచే ప్రమాదం ఉందని పార్టీ సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తా: అడ్లూరి

పొన్నం వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు. 'జరిగిన పొరపాటును ఒప్పుకొని క్షమాపణ చెబితే పొన్నంకు గౌరవం ఉంటుంది. మాదిగలు అంటే అంత చిన్న చూపా?' అని ఆయన ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నం తన తప్పు తెలుసుకుంటాడని ఆశించానని, కానీ ఆయన మారకపోతే జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంతేకాకుండా, 'నేను మాదిగను కాబట్టే నాకు మంత్రి పదవి వచ్చింది. నేను మంత్రి కావడం, మా సామాజిక తరగతిలో పుట్టడం తప్పా?' అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. మంత్రి వివేక్ తన పక్కన కూర్చోవడానికి కూడా ఇష్టపడటం లేదని, ఇది ఎంతవరకు సమంజసమని ఆయన వాపోయారు.

సర్దుబాటుకు అధిష్ఠానం యత్నం

ఈ వివాదం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలను మరోసారి బయటపెట్టింది. సొంత పార్టీ నేతలే పొన్నం వైఖరిని తప్పుబడుతున్నారు. జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణులు సైతం లక్ష్మణ్‌కు మద్దతుగా నిలిచి, పొన్నం తీరును తప్పుబట్టాయి. బుగ్గారం మండల కాంగ్రెస్ నాయకులు పొన్నం వ్యాఖ్యలను ఖండించారు. మరో మంత్రి శ్రీధర్‌బాబు కూడా పొన్నం వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. దాంతో రంగంలోకి దిగిన టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ గౌడ్ ఇద్దరు మంత్రులతో మాట్లాడి వివాదాన్ని సద్దుమణిగేలా ప్రయత్నం చేశారు. మరోవైపు 24 గంటల్లో పొన్నం క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయన కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎమ్మార్పీఎస్ హెచ్చరించింది. పొన్నంను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలన్న డిమాండ్లు కూడా ఊపందుకున్నాయి. మొత్తం మీద, పొన్నం ప్రభాకర్ నోటి దురుసు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. ఈ వివాదాన్ని అధిష్ఠానం ఎలా పరిష్కరిస్తుందో వేచి చూడాలి.

అందరి చూపు హైకోర్టు వైపు

- బిసి రిజర్వేషన్ల పిటిషన్‌పై నేడు విచారణ
- మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాలోచనలు
- న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ దవేకు పిలుపు
- సర్కారుకు ప్రతిష్మాత్మకంగా రిజర్వేషన్లు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

స్థానిక ఎన్నికలు సర్కారు సన్నద్ధమైనప్పటికీ అందరి దృష్టి హైకోర్టు వైపే ఉంది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నది. సుప్రీం కోర్టులో బిసి రిజర్వేషన్ల పిటిషన్ కొట్టివేసిన సంగతి తెలిసిందే. బుధవారం హైకోర్టులో విచారణకు రానున్న నేపథ్యంలో రేవంత్ సర్కారు అప్రమత్తమైంది. మంగళవారం సాయంత్రం సిఎం క్యాంపు కార్యాలయంలో మంత్రులతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు వెళ్లితే ఎలా ఉండబోతున్నది. హైకోర్టులో రిజర్వేషన్లపై తీర్పు ఏ విధంగా రావచ్చు. అనే అంశాలపై సుదీర్ఘంగా సిఎం ఆరా తీసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. సుప్రీం కోర్టులో బిసి పిటిషన్‌పై దాఖలైన పిటిషన్ కొట్టివేసిన తీరునూ, హైకోర్టులో బిసి రిజర్వేషన్ కేసు విచారణ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహం, వినిపించాల్సిన వాదనలపై కూడా చర్చించారు. బిసి రిజర్వేషన్లపై వాదనలు వినిపించడానికి సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులైన అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ దవేను సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేకంగా కోరారు. కేసు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించేలా చర్యలు తీసుకుంటుంది. బుధవారం హైకోర్టులో విచారణకు రానున్న బిసి రిజర్వేషన్ల అంశంపై వారివురూ వాదనలను వినిపించనున్నారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై అడుగడుగునా అప్రమత్తవుతున్న తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులోనూ కేసు గెలిచేందుకు ప్రయత్నం చేస్తోంది. బిసి రిజర్వేషన్ల అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ ముందుకు పోవాలని నిర్ణయించింది.



మంత్రుల సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ యువకుడు మృతి, యువతి పరిస్థితి విషమం
- జనగామ జిల్లా తాటికొండలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రేమ జంట మనస్తాపంతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ మండలం తాటికొండ గ్రామంలో మంగళవారం జరిగింది. యువతి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటికొండ గ్రామానికి చెందిన మారపాక అంజయ్య కుమారుడు మారపాక అన్వేష్ (22), పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన గడ్డం పావని (20) ఇద్దరూ ప్రేమించుకున్నారు. కాగా మూడు నెలలుగా తాటికొండలో అన్వేష్ ఇంట్లోనే జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇద్దరూ గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అన్వేష్ తల్లి రేణుక వచ్చి చూసేసరికి ఇంట్లో పడి ఉన్నారు. దాంతో హుటాహుటిన వారిని వరంగల్ ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం అన్వేష్ మృతి చెందగా పావని పరిస్థితి విషమంగా ఉంది. వారి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుని తండ్రి మారపాక అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సిఎం ప్రజావాణికి 302 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 302 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 87, రెవెన్యూ శాఖకు సంబంధించి 42, ఇందిరమ్మ ఇళ్ల కోసం 102, ప్రవాసి ప్రజావాణికి 03 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 68 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు.

చిన్నారెడ్డిని సన్మానించిన గ్రూప్ - 2 అభ్యర్థులు

గ్రూప్ - 2 పరీక్షలలో ఎంపికైన అభ్యర్థులు సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డిని మంగళవారం ప్రజా భవన్‌లో శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రూప్ - 2 ఫలితాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో పలు మార్లు ప్రజా భవన్‌లో జరిగే సిఎం ప్రజావాణికి వచ్చి ఆయన్ను కలువగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, సెక్రటరీలతో ఫోన్ ద్వారా మాట్లాడి ధైర్యం నింపినందున వారికి ధన్యవాదాలు తెలిపారు. పోస్టింగ్స్ కూడా తొందరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అభ్యర్థులు కోరారు.

నియామకాల్లో సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలి

- కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 నియామకాల్లో సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఫలితాలు ప్రకటించి నియామక పత్రాలు అందజేసినా వారికి ఆ ఉద్యోగాలపై ఎలాంటి హక్కులేదని సర్వోన్నత న్యాయస్థానం ప్రకటించిందని ఆమె తెలిపారు. గ్రూప్-1 ఉద్యోగ నియామకాల వివాదం న్యాయ స్థానాల్లో తేలేవరకు అభ్యర్థుల మెయిన్స్ ఆన్సర్ షీట్లను తొందరపడి డిస్పోజ్ చేయొద్దని కోరారు. తెలంగాణ ప్రభుత్వం గ్రూప్-1 నోటిఫికేషన్ నుంచి ఫలితాల ప్రకటన వరకు అనేక తప్పులు చేసిందనీ, ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను తుంగలో తొక్కిందని విమర్శించారు. న్యాయస్థానాలు తుది తీర్పు ఇచ్చేలోపు ప్రభుత్వం అభ్యర్థుల మెయిన్స్ ఆన్సర్ షీట్లను డిస్పోజ్ చేస్తే నిరుద్యోగులతో కలిసి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

ఎన్‌డిఎస్‌ఎ నివేదిక మేరకే కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ

- ఈ నెల 22లోగా నిర్ణయం
- నీటిపారుదల శాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ఆధారంగానే కాళేశ్వరం బ్యారేజీలను పునరుద్ధరిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల పనులను పూర్తిచేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాలువ (ఎస్-ఎల్‌బిసి) టన్నెల్, అలాగే కాళేశ్వరం కింద మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో తుమ్మడిహట్టి భాగాన్ని మొదటి అంశంగా తీసుకుంటూ, ఇంజనీరింగ్ బృందాలు రెండు ప్రత్యామ్నాయ కాలువ మార్గాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఏ మార్గాన్ని ఎంచుకోవాలనే విషయమై ఈనెల 22లోగా నిర్ణయిస్తామన్నారు. మైలారం నుంచి 71.5 కిలోమీటర్ల గ్రావిటీ కాలువ, 14 కిలోమీటర్ల సొరంగం ద్వారా సుందిళ్ల నీరు తరలిస్తామని చెప్పారు. మరో మార్గం ప్రకారం మధ్యలో పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి యెల్లంపల్లి ద్వారా నీటిని మళ్లించడం జరుగుతుందని వివరించారు. ఈ రెండు ప్రత్యామ్నాయాల ఖర్చు, హైడ్రాలిక్ సామర్థ్యం, భౌగోళిక అనుకూలత విద్యుత్ అవసరాలపై సమీక్షించారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాలువ (ఎస్-ఎల్‌బిసి) టన్నెల్ ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుర్తు చేశారు. భూగర్భ ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ తెలంగాణ నీటి పారుదల నిర్మాణంలో కీలక భాగమన్నారు. ఇది శ్రీశైలం జలాశయాన్ని కరువు ప్రాంతాలతో అనుసంధానిస్తూ 43 కిలోమీటర్ల పొడవైన టన్నెల్ ద్వారా వేల ఎకరాల వ్యవసాయ భూములకు కృష్ణానదీ జలాలను అందించడానికి రూపొందించబడిందని చెప్పారు. ప్రముఖ ఐఐటీ ప్రధాన సాంకేతిక భాగస్వామిగా వ్యవహరించే అవకాశం ఉందన్నారు. ఇది తెలంగాణ నీటి పారుదల శాఖకు చెందిన చీఫ్ డిజైన్ ఆర్గనైజేషన్ (సిడిఒ)తో కలిసి పని చేస్తుందని వివరించారు. వర్షాకాలానికి ముందే పరీక్షలు పూర్తయ్యాయని వివరించారు. పునరుద్ధరణ ప్రక్రియ ఎన్‌డిఎస్‌ఎ సిఫారసులకు అనుగుణంగా ఉంటుందన్నారు. సమ్మక్క-సరక్క ప్రాజెక్టు పురోగతిని కూడా సమీక్షించారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి)ను సంప్రదించి నీటి కేటాయింపు, టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టిఎసి) ఆమోదం కోరిందని తెలిపారు. సీతమ్మసాగర్, మొండికుంటవాగు, చనాక-కోరాట పంపిణీ వ్యవస్థలు చిన కాళేశ్వరం ప్రాజెక్టుల పెట్టుబడి ఆమోద దరఖాస్తులు కేంద్రానికి సమర్పించామన్నారు. కేంద్రం ఆమోదించిన తర్వాత ఈ ప్రాజెక్టులు గోదావరి, కష్ణా పరివాహక ప్రాంతాల్లో నీటి పారుదల సామర్థ్యాన్ని పెంచుతాయని చెప్పారు. దేవాదుల ప్రాజెక్టు శాఖ ప్రధాన ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో ఒకటని గుర్తు చేశారు. ప్యాకేజీ-6, అదనపు మూడో దశ ప్యాకేజీలకు ఆమోదం లభించిందని తెలిపారు. భూ సేకరణ పరిహారంగా రూ.33 కోట్లు తక్షణమే విడుదల చేయాలని కోరారు. 'దేవాదుల ప్రాజెక్టు గణనీయమైన భౌతిక పురోగతి సాధించిందని, త్వరలోనే భూస్థాయి ఫలితాలను ఇస్తుంది' అని పేర్కొన్నారు. డిండి ప్రాజెక్టుపై సమగ్ర సమీక్షా నివేదిక సిద్ధం చేయాలనీ, ఇందులో భౌతిక పురోగతి, నిధుల వినియోగం పెండింగ్ పనులు ఉండాలని ఆదేశించారు. ఈ నివేదిక మూడు రోజులలో సమర్పించాల్సి ఉంటుందన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

ఎస్‌సి ప్రజాప్రతినిధులంటే ఎందుకింత ద్వేషం

- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కించపరిచేలా మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత ప్రజా ప్రతినిధులను కించపరచడం కాంగ్రెస్ సర్కార్‌కు పరిపాటిగా మారిందని విమర్శించారు. ఎస్‌సి సామాజిక వర్గానికి గౌరవంగా నిలిచిన రాష్ట్ర మంత్రిపై కావాలనే మరో మంత్రి పొన్నం ప్రభాకర్ చేత అవమానకర వ్యాఖ్యలు చేయిస్తోందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా తెలంగాణలో బిసిలు ఎస్‌సిలు మైనార్టీ ప్రజలు కలిసి ఉంటున్నారని గుర్తు చేశారు. అది చూడలేకే కాంగ్రెస్.. బిసిలు, ఎస్‌సిలపై కాంగ్రెస్ వ్యక్తిగత దూషణలు చేయిస్తున్నదని ఆరోపించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ట్రిపుల్ ఆర్ పనులను వెంటనే మొదలుపెట్టాలి

- మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రిపుల్ ఆర్ పనులను వెంటనే మొదలుపెట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రిపుల్ ఆర్‌కు సంబంధించిన పనులు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగదీస్తున్నాయని ఆయన విమర్శించారు. కెసిఆర్ మదిలో మెదిలిన ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు కోసం బిఆర్‌ఎస్ 2015 నుంచి ప్రయత్నాలు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని, ఒక్క రైతుకు ఇవ్వలేదనీ, ఒక్క ఎకరా భూసేకరణ చేయలేదనీ, బిఆర్‌ఎస్ తెచ్చిన రూ.3 వేల కోట్లు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు డబ్బులు చెల్లించకుండా 80 శాతం భూసేకరణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఉత్తరంవైపు మూడు సార్లు టెండర్లు పిలిచి ఓపెన్ చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాయిదా వేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చిన అలైన్ మెంట్‌ను రేవంత్ సర్కార్ కేంద్రానికి పంపలేదని తెలిపారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్ ,లక్ష్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రశాంత్

ప్రాణహిత నది పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్ తుమిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిని పరిశీలించారు. మంగళవారం ఉదయం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి కుమురం భీం - ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని తుమిడిహెట్టి ప్రాణహిత నది వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రాజెక్టు నిర్మించేందుకు గతంలో గుర్తించిన స్థలం, ప్రస్తుత ప్రతిపాదిత స్థలం గురించి అధికారులు మ్యాప్ ద్వారా వివరించారు. తీరంలో తిరిగి పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమగ్ర వివరాలు అందించాలని ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు తుమిడిహెట్టికి ఎగువన వార్ధా, వైన్‌గంగ నదుల సంగమంతో ప్రాణహితగా ఏర్పడే ప్రాంతాన్ని మ్యాప్‌లో చూపించగా ప్రశాంత్ పాటిల్ బైనాక్యులర్ సాయంతో పరిశీలించారు. ఆయన వెంట ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సత్యరాజచంద్ర, కాగజ్‌నగర్ ఎస్‌ఈ రవి కుమార్, ఈఈ ప్రభాకర్, డీఈ ఎల్లా వెంకటరమణ, భద్రయ్య, తిరుపతి, భానుమూర్తి, తహసీల్దార్ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

కుమురం భీం స్ఫూర్తి యావత్ ప్రపంచానికే ఆదర్శం

- కుమురం భీం 85వ వర్ధంతిలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జల్.. జంగిల్.. జమీన్ కోసం పోరాడిన కుమురం భీం పోరాట స్ఫూర్తి తెలంగాణకే కాదు.. యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. కుమురం భీం - ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఆదివాసుల ఆరాధ్య దైవం కుమురం భీం 85వ వర్ధంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ భీం విగ్రహానికి నివాళు లర్పించారు. సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఆదివాసుల ఆశాజ్యోతి కుమురం భీం పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందన్నారు. ప్రజల కోసం, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం, బానిసత్వపు సంకెళ్ల తెంచడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. గిరిజనుల హక్కుల సాధన కోసం గోండు వీరుడు కుమురం భీం తన జీవితాంతం పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి గోడం నగేష్, ఖానాపూర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, కోవలక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షులు విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఎమ్మెల్సీ దండే విఠల్, కుమురం భీం మనువడు సోనేరావు, ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్‌పి క్రాంతిలాల్ పాటిల్, ఐటిడిఏ పిఒ ఖుష్బూ గుప్తా, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కుమురం భీం వర్ధంతిలో పాల్గొన్నారు మంత్రులు కృష్ణారావు, లక్ష్మణ్

రాష్ట్ర కార్యక్రమంగా కొమురం భీమ్ వర్ధంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్‌రెడ్డి ఆదివాసీ ప్రతినిధులకు ఇచ్చిన మాట ప్రకారం కొమురం భీమ్ వర్ధంతిని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది. అందుకు అనుగుణంగా మంగళవారం కొమురం భీమ్ అమరస్థలి జోడేఘాట్‌తో పాటు జిల్లా కలెక్టరేట్లు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాలు, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొమురం భీమ్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సముదాయంలోని గిరిజన మ్యూజియంలో సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలను నిర్భయంగా ఎదుర్కొని వారి, అటవీ భూ హక్కుల కోసం పోరాడిన ధీరుడు భీమ్ అని కొనియాడారు. అతని త్యాగం వృథా పోకుండా ప్రభుత్వాలు పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో అణగారిన వర్గాల అభ్యున్నతికోసం అహర్నిశలు కృషి చేసిన ఎస్‌ఆర్ శంకరన్ వర్ధంతిని కూడా జరుపుకున్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు విట్టా సర్వేశ్వర్ రెడ్డితో పాటు గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ, ట్రైకార్, జీసీసీ, ఇంజనీరింగ్, విద్య, ప్లానింగ్ తదితర విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొని కుమ్రం భీమ్, ఎస్. ఆర్.శంకరన్‌కు నివాళులర్పించారు.

సురభి కాలేజి చైర్మన్ పన్సిపాల్‌పై వారెంట్ జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంటనే ఇవ్వాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను సిద్ధిపేటలోని సురభి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పాటించక పోవడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాలేజి చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్‌పై బెయిలబుల్ వారెంట్ చేస్తూ కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ ఆదేశాలు జారీ చేశారు. డాక్టర్ మెరుగు కార్తిక్ సురభి కాలేజిలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. అతని ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఆయన ఇటీవల హెచ్‌ఆర్‌సిని ఆశ్రయించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన కమిషన్ వెంటనే కార్తిక్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించింది. అయితే కమిషన్ ఆదేశాలను సదరు కాలేజి పాటించలేదు. దాంతో కార్తిక్ పీజీ ప్రవేశానికి గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేకపోవడంతో ఆయన విద్యా సంవత్సరం వృథా అయింది. కమిషన్ ఆదేశాలను సురభి కాలేజి పాటించకపోవడం వల్ల జరిగిన నష్టాన్ని వివరిస్తూ తిరిగి హెచ్‌ఆర్‌సిని బాధితుడు ఆశ్రయించారు. కాలేజి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్‌పై కమిషన్ వారెంట్ జారీ చేసింది. 2020లో జగిత్యాల జిల్లా ధర్మపురి ప్రాంతానికి చెందిన ఏడేళ్ల చిన్నారి తిప్పర్తి సహస్ర మరణం ఆల్బెండజోల్ మాత్ర తీసుకున్న తర్వాత సంభవించిందని వచ్చిన వార్తాపత్రిక కథనంపై కమిషన్ సుమోటో కేసు నమోదు చేసింది.

ట్రాన్స్‌జెండర్ల సమస్యలు పరిష్కరించాలి

- ట్రాన్స్‌జెండర్లు, హిజ్రాల సదస్సులో నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రాన్స్ జెండర్ల సమస్యలను పరిష్కరించాలని పలువురు నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టిపిఎస్‌కె), హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్ (హెచ్‌ఆర్‌ఎల్‌ఎన్), క్రిస్టియన్ సర్వీస్ ఏజెన్సీ (సిఎస్‌ఎ), సబ్‌రంగ్ సంయుక్తాధ్వర్యంలో కమ్యూనిటీ కమిటీల బలోపేతం కోసం ట్రాన్స్ జెండర్లు, హిజ్రాల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్ల యాక్టివిస్ట్ రచన ముద్రబోయిన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు, హిజ్రాలు తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించాలని కోరారు. అడుక్కోవడం దగ్గర గొంతులు పెంచడం కాకుండా హక్కుల విషయంలో గొంతులు పెంచి ప్రభుత్వాల మెడలు వంచాలని పిలుపునిచ్చారు. సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ వివక్ష, హింసను అంతం చేస్తామని ప్రకటించారు. ట్రాన్స్ పీపుల్స్ రైట్స్‌ను హుమన్స్ రైట్స్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్ జెండర్లు ప్రజలతో మమేకంగా కావాలన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, రచన మాట్లాడారు. తెలంగాణలోని హిజ్రాలు, ట్రాన్స్‌జెండర్లు సుమారు మూడు లక్షల మంది ఉన్నారని, వారి సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. విద్య వైద్యం ఉపాధి అవకాశాలు కల్పించాలనీ, వారి కోసం ఇండ్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హిజ్రా, ట్రాన్స్‌జెండర్ల అసోసియేషన్ అధ్యక్షులు మోనాలిసా మాట్లాడుతూ హిజ్రాలు, ట్రాన్స్ జెండర్లు మనుషులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. హిజ్రాల సముదాయాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలనీ, తెలంగాణ ట్రాన్స్ జెండర్ పర్సన్స్ ప్రొటెక్షన్ రైట్స్ వెంటనే అమలు చేయాలని కోరారు.

ప్రజలు అర్థం చేసుకోవాలి

పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, సామాజిక వేత్తలు కొండవీటి సత్యవతి, సజయ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లను ప్రజలను అర్థం చేసుకోవాలని కోరారు. ట్రాన్స్ జెండర్లను దేశంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కలా పిలుస్తారని, వీరందరికీ సమాన హక్కులు కల్పించాలని కోరారు. తెలంగాణలో ప్రత్యేక సర్వే చేసి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్లకు సంబంధించి 60 మంది గురువులు సంఘమిత్ర, సోనీ, మనోరమ, ప్రియా,శిల్ప, ప్రేమమ్మ,శోభ, సమీరా, యాస్మిన్, సోనారథోడ్, తదితరులు పాల్గొన్నారు. ట్రాన్స్ జెండర్ హిజ్రాల కల్చరల్ ఫెస్ట్‌ను 2025 నవంబర్ చివర్లో నిర్వహించి తమ ప్రతిభ పాటవాలు సమాజానికి తెలియజేయాలని సదస్సులో తీర్మానించారు.



కేర్ హాస్పిటల్స్ సిఇఒగా పవన్ కుమార్ నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్



ప్రముఖ ప్రయివేటు వైద్య సేవల సంస్థ కేర్ హాస్పిటల్స్‌కు నూతన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా డాక్టర్ పవన్ కుమార్ నియమితులయ్యారు. తమ సంస్థ వ్యూహాత్మక దిశ, కార్యకలాపాలు, విస్తరణలో వపన్ కుమార్ కీలక పాత్ర పోషించనున్నారని ఆ హాస్పిటల్ యాజమాన్యం ఓ ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేసింది. దేశం అంతటా నాణ్యమైన, సులభంగా అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణను అందించాలనే తమ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లనున్నారని పేర్కొంది. అనస్థీషియాలజిస్ట్ అయిన పవన్ కుమార్, చండీగఢ్‌లోని పిజిఐఎంఇఆర్ నుండి అనస్థీషియాలజీలో ఎమ్‌డి, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) నుండి ఫైనాన్స్, హెల్త్‌కేర్‌లో ఎంబిఎ చేశారు. 'డాక్టర్ పవన్ కుమార్‌ను కేర్ హాస్పిటల్స్ సిఇఒగా స్వాగతించడం తమకు సంతోషంగా ఉంది. ఆయన డైనమిక్ నాయకత్వం, ఆరోగ్య సంరక్షణ రంగంపై లోతైన అవగాహన, నిబద్ధత ఆయనను తమ సంస్థకు అమూల్యమైన ఆస్తిగా మారుస్తాయి." అని క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ ఎమ్‌డి వరుణ్ ఖన్నా పేర్కొన్నారు. కేర్ హాస్పిటల్స్‌లో చేరడం తనకు ఎంతో గౌరవంగా ఉందని పవన్ కుమార్ పేర్కొన్నారు.

వడ్డీ బాధితుడు ఆత్మహత్య

- పిఏపల్లి మండలం పలుగుతండాలో బాలాజీనాయక్ ఇంటిపై దాడి
- విలువైన వస్తువులు ధ్వంసం.. ఫర్నీచర్‌కు నిప్పు
- గ్రామంలో ఉద్రిక్తత, పోలీసుల రంగ ప్రవేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఫర్నీచర్‌ను తగులబెడుతున్న దృశ్యం

అధిక వడ్డీ ఆశ చూపి పేదల నుంచి కోట్ల రూపాయలను వసూలు చేసి డబ్బులను తిరిగి ఇవ్వకపోవడంతో ఆందోళన చెందిన బాధితుడు రమావత్ సరియానాయక్ (37) గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. దాంతో మృతుని బంధువులు, తండావాసులు ఆగ్రహంతో బాలాజీ నాయక్ ఇంటిపై మంగళవారం దాడికి పాల్పడ్డారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం పలుగుతండాకు చెందిన రమావత్ బాలాజీనాయక్ నూటికి రూ. 10 నుంచి 16 రూపాయల వరకు వడ్డీ ఇస్తానని నమ్మించి డబ్బులు డిపాజిట్‌గా తీసుకున్నాడు. ఇలా కోట్లాది రూపాయలు వసూలు చేశారు. ఇంట్లోకి ఫర్నిచార్‌కి సరియానాయక్ నిరుపేద కుటుంబం. బతుకుదెరువు కోసం మిర్యాలగూడకు వెళ్లాడు. అతనికి కేవలం ఐదు గుంటల భూమి మాత్రమే ఉంది. సరియానాయక్ అధిక వడ్డీ ఆశతో తెలిసిన వారి నుంచి రూ.30 లక్షల వరకు అప్పు తీసుకొని బాలాజీనాయక్‌కు ఇచ్చాడు. తానిచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని, ఎన్నిసార్లు అడిగిన బాలాజీనాయక్ నుంచి ఎలాంటి స్పందన లేదు. తనకు అప్పులు ఇచ్చినవారు డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తుండటంతో వాటిని ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందిన సరియానాయక్ సోమవారం మిర్యాలగూడ పట్టణంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దాంతో తండావాసులు పలుగుతండాలోని బాలాజీనాయక్ విలాసవంతమైన భవనాన్ని ధ్వంసం చేశారు. ఇంటి ముందు వేసి తగులబెట్టారు. ఇంటి కిటికీలు, ఇంట్లో ఉన్న విలాస వస్తువులు, టివి, డోర్లు పగులగొట్టారు. ఈ ఘటనతో బాలాజీనాయక్ బాధితుల్లో కలవరం మొదలైంది. తండాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి బాధితులతో చర్చలు జరుపుతున్నారు.